ఓటర్లే.. ఓటర్లు!

- జిల్లాలో పెరుగుతున్న ఓటర్ల సంఖ్య
- 16లక్షల11వేలు దాటిన ఓటర్లు
- జనవరి జాబితా కంటే 11956 అధికం
- జిల్లాలో మరో మూడు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేంద్రాల గుర్తింపునకు కసరత్తు



కలెక్టరేట్(కాకినాడ), మార్చి 17: కాకినాడ జిల్లాలో ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. ఓటు నమోదు కోసం ఫారం-6 దరఖాస్తులు రావడంతో ఆ సంఖ్య గణనీయంగా పెరిగింది. యువతతోపాటు, ఇతర ప్రాంతాలనుంచి వలస వచ్చిన ఓటర్లు ఫారం-6 దరఖాస్తులను సమర్పిస్తున్నారు. శనివారంనాటికి కాకినాడ జిల్లాలో 16,11,021 ఓటర్లు నమోదైనట్లు అధికారులు గణాంకాలను విడుదల చేశారు. దీనిలో పురుషులు 7,93,455మంది కాగా, మహిళలు 8,17,393మంది ఉన్నారు. జిల్లాలో మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా దీనిలో అత్యధికంగా కాకినాడ రూరల్ నియోజకవర్గంలో 2,64,106 మంది ఓటర్లు ఉన్నారు. పెద్దాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యల్పంగా 2,12,559 మంది ఓటర్లు ఉన్నారు.

జనవరిలో జాబితా కంటే అధికం..

ఈ ఏడాది జనవరి నెలలో ఎన్నికల సంఘం ఓటర్లకు సంబంధించి తుది జాబితాను ప్రచురించింది. ఆ జాబితా ప్రకారం కాకినాడ జిల్లాలో 15,99,065 మంది ఓటర్లు ఉన్నారు. ప్రస్తుతం ఆ సంఖ్య 16,11,021కు పెరిగింది. అంటే 11956మంది ఓటర్లు అధికంగా వచ్చి జాబితాలో చేరారు. ఈ నేపథ్యంలో జిల్లాలో పోలింగ్ కేంద్రాల సంఖ్య కూడా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

మరో మూడు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు

జిల్లాలో ఇప్పటివరకు 1637 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. పెరుగుతున్న ఓటర్ల జాబితా దృష్ట్యా మరో మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రధానంగా కాకినాడ సిటీ, తుని, పెద్దాపురం అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కొక్కటి చొప్పున పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇవ్వాలని జిల్లాలో ఎన్నికల అధికారులు రాష్ట్ర ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపారు.

అత్యంత సమస్యాత్మక కేంద్రాలపై కసరత్తు

జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించే కసరత్తు జరుగుతోంది. దీనిపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించారు. గత సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో ఎక్కడెక్కడ వివాదాలు, గొడవలకు దారి తీశాయో అలాంటి కేంద్రాలను గుర్తించే ప్రక్రియ జరుగుతోంది. ఈ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు వీలుగా సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలని సమాలోచనలు చేస్తున్నారు.

నోటిఫికేషన్ వచ్చినా ఓటు నమోదు చేసుకోవచ్చు

సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్(షెడ్యూల్) విడుదలైంది. అయినప్పటికీ కొత్తగా ఓటు నమోదు చేసుకునేవారు ఫారం-6 దరఖాస్తు చేయవచ్చునని అధికారులు తెలిపారు. ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన తర్వాత ఓటు చేర్పులు, మార్పులు, తొలగింపులకు అవకాశం లేదని వెల్లడించారు.

ఎన్నికల ప్రవర్తన నియమావళితో.. నిలిచిపోయిన 'స్పందన'

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 17: కాకినాడ జిల్లా కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమంతోపాటు ఇతర స్పందన కార్యక్రమాలు నిలిచిపోయాయి. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి రావడంతో జిల్లావ్యాప్తంగా జరిగే వివిధ స్పందన ప్రజలనుంచి అర్జీలను స్వీకరించే క్రతువును నిలుపుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా వెల్లడించారు. సార్వత్రిక ఎన్నికలు ముగిసి తిరిగి ఫలితాలు వెలువడే వరకు ఎలాంటి స్పందన కార్యక్రమాలు నిర్వహించడం లేదన్నారు. ఎన్నికలు ముగిసే వరకు ప్రజలు అర్జీలతో జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చే పరిస్థితి లేదు. అధికారులు అందరూ సార్వత్రిక ఎన్నికల విధుల్లో మునిగి ఉండడం వల్ల ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు నిర్దేశించిన కొన్ని కార్యక్రమాలను వాయిదా వేశారు.

బొలెరో వ్యాన్ ఢీకొని ఇద్దరు యువకుల మృతి

- కిర్లంపూడి మండలం రాజుపాలెంలో ఘటన

కారు బైక్‌ను ఢీకొని వ్యక్తి మృతి

- ప్రత్తిపాడు- ధర్మవరం హైవేపై ఘటన

జిల్లాలో ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్షలు

- 4,179మంది అభ్యర్థులు హాజరు
- జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా

కలెక్టరేట్(కాకినాడ)/గండేపల్లి, మార్చి 17: జిల్లాలో గ్రూప్-1 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, దీనికి 4,179 మంది అభ్యర్థులు హాజరయ్యారని కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. ఈ మేరకు సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లో ఉదయం, సాయంత్రం జరిగిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు ఆదిత్య ఇంజనీరింగ్ క్యాంపస్ డైరెక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు, మధ్యాహ్నం 2గంటలనుంచి సాయంత్రం 4 గంటల వరకు రెండు సెషన్లలో ఈ పరీక్షలు జరిగాయన్నారు. జిల్లావ్యాప్తంగా 6,843మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 4,179మంది హాజరయ్యారని వెల్లడించారు. 61శాతం మాత్రం హాజరు నమోదైందన్నారు. వివిధ కారణాలవల్ల 2,664మంది పరీక్షలకు గైర్హాజరయ్యారన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు నిర్వహించామన్నారు.



సూరంపాలెం ఆదిత్యలో పరీక్ష రాసేందుకు వస్తున్న అభ్యర్థులు

వైసీపీ కార్యాలయంలో విందు భోజనాలు

గొల్లప్రోలు, మార్చి 17: ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో అధికారపార్టీ ప్రలోభాలకు, ఓటర్లకు ఆకట్టుకునే ప్రయత్నాలకు తెరలేపింది. గొల్లప్రోలులోని వైసీపీ పట్టణ కార్యాలయంలో విందు భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. కార్యకర్తలు, ప్రజలను ఈ భోజనాలకు తీసుకువస్తున్నారు. కొంతమందికి మద్యం పంపిణీ చేస్తున్నట్లు సమాచారం. ఆదివారం రాత్రి చికెన్ బిరియానీ ఏర్పాటుతో ప్రజలు అధికంగా తరలివచ్చారు. నగర పంచాయతీ కీలక ప్రజాప్రతినిధి కనుసన్నల్లో ఈ వ్యవహారం సాగుతున్నట్లు సమాచారం. ఎన్నికల ప్రవర్తనానియమావళికి విరుద్ధంగా ఇవి సాగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడాన్ని ప్రజలు తప్పుబడుతున్నారు.



గొల్లప్రోలు వైసీపీ కార్యాలయంలో భోజనాలకు వచ్చిన ప్రజలు

పవన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపిద్దాం

- పిఠాపురంలో టీడీపీ కేడర్‌కు మాజీ ఎమ్మెల్యే వర్మ పిలుపు



పిఠాపురంలో జరిగిన టీడీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, మార్చి 17: టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా పిఠాపురంనుంచి పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను అందరూ కలిసికట్టుగా పనిచేసి రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలిపిద్దామని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ పిలుపునిచ్చారు. పిఠాపురం పట్టణంలో మునిసిపల్ కార్యాలయంవద్దగల పాత టీడీపీ కార్యాలయ ఆవరణలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొత్తులో భాగంగా టీడీపీకి సీటు కేటాయించకపోవడం, సమాచారం ఇవ్వకపోవడంతో నాయకులు, కార్యకర్తలు తీవ్ర ఆవేదన, బాధకు గురయ్యారన్నారు. తాను కూడా బాధపడ్డానని తెలిపారు. పార్టీ అధినేత చంద్రబాబు పిలుపుతో వెళ్లి కలిసి కార్యకర్తల మనోవేదనను వివరించానని చెప్పారు. కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటానని చంద్రబాబు భరోసా ఇవ్వడంతోపాటు తనకు ఎమ్మెల్సీ క్షత్రియ కోటాలో ప్రమోషన్ ఇస్తానని చెప్పారని తెలిపారు. టీడీపీ కార్యకర్తలు, నాయకుల గౌరవానికి భంగం కలగకుండా పవన్‌కోసం చంద్రబాబు సూచనలకు అనుగుణంగా పనిచేద్దామని చెప్పారు. గ్రామాల్లో జనసేనతో ఉన్న ఇబ్బందులకు పరిష్కరించుకుని ముందుకు వెళ్దామని తెలిపారు. తన కోసం కష్టపడిన దాని కంటే అధికంగా రోజుకు 18గంటలు పవన్‌కోసం పనిచేస్తానని చెప్పారు. ఇప్పటివరకూ 52వేల ఇళ్లు, 1.52లక్షలమంది ఓటర్లను తాను, తమ టీడీపీ టీమ్ కలిసిందని తెలిపారు. తనకు స్వేచ్ఛనిస్తే ఎన్నికల్లో రెట్టింపు ఉత్సాహంగా పనిచేస్తానని ప్రకటించారు. సమావేశంలో నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా వర్మను జనసేన నాయకుడు కడారి తమ్మయ్యనాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తి, చెందుర్తి, చినజగ్గంపేట, పిఠాపురం మండలం చిత్రాడ, కొత్తపల్లి మండలం సుబ్బంపేట గ్రామాలకు చెందిన వారితో సమావేశమై పవన్‌ను గెలిపించాలని కోరారు.

ప్రశాంతంగా రాయండి

- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు
- ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ పరీక్ష
- జిల్లావ్యాప్తంగా 137 కేంద్రాల్లో నిర్వహణ
- హాజరుకానున్న 32,262మంది విద్యార్థులు
- అన్ని ఏర్పాట్లు పూర్తి: డీఈవో



కాకినాడ రూరల్, మార్చి 17: పదో తరగతి విద్యార్థులకు సోమవారంనుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని ఆర్జేడీ జి.నాగమణి తెలిపారు. విద్యార్థులు తమతోపాటు హాల్ టికెట్లను తీసుకువెళ్లాలన్నారు. కాకినాడ జిల్లాలో 137 కేంద్రాల్లో 32,262మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని, విద్యార్థులకు పరీక్షల్లో 24 పేజీలతో కూడిన బుక్‌లెట్‌ను అందించనున్నారని, అది అయిపోతే మరో 12 పేజీల బుక్‌లెట్‌ను అదనంగా అందజేస్తారన్నారు. విద్యార్థులు ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాల్లోకి తీసుకువెళ్లేందుకు అనుమతి లేదన్నారు. పరీక్షలు 8రోజులపాటు జరుగుతాయన్నారు. పరీక్షలు ఉదయం 9.30 గంటలనుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ జరుగుతాయని తెలిపారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

- పరీక్షల నిమిత్తం 24గంటలు అందుబాటులో ఉండేలా 9000399069 కంట్రోల్‌రూమ్ నెంబర్ ఏర్పాటు చేశారు.
- సార్వత్రిక విద్య పది, ఇంటర్ పరీక్షలు కూడా సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయని డీఈవో పి.రమేష్ తెలిపారు. ఈ పరీక్షలకు కాకినాడజిల్లాలో మొత్తం ఏడు కేంద్రాల్లో పది పరీక్షలకు 2,067మంది, ఇంటర్ పరీక్షలకు 20 కేంద్రాల్లో 6494మంది విద్యార్థులు హాజరుకానున్నారని ఓపెన్‌స్కూల్ జిల్లా సమన్వయకర్త పి.సాయివెంకటరమణ తెలిపారు. ఈ పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకూ జరుగుతాయన్నారు.

పెద్దాపురంలో దవులూరి ప్రచారాన్ని అడ్డుకున్న పోలీసులు

- అనుమతి రాకుండానే ప్రచారంతో నిలుపుదల



ప్రచార అనుమతులపై ఆరా తీస్తున్న సీఐ రవికుమార్

పెద్దాపురం, మార్చి 17: పెద్దాపురం వైసీపీ అభ్యర్థి దవులూరి దొరబాబు విజయ సంకల్ప యాత్ర పేరుతో చేపట్టిన కార్యక్రమాన్ని పోలీసులు ఆదివారం అడ్డుకున్నారు. ప్రచారానికి అనుమతికి దరఖాస్తు చేసి అనుమతి రాకుండానే ప్రచారం చేయడంతో పోలీసులు ప్రచారాన్ని మధ్యలోనే నిలుపుదల చేశారు. పెద్దాపురం మెయిన్ రోడ్డు వద్దకు ప్రచార కార్యక్రమం చేరుకోగానే సీఐ రవి కుమార్ కార్యక్రమానికి అనుమతి లేదని, దొరబాబుకు చెప్పడంతో ఆయన తన ప్రచారాన్ని ముగించుకుని కార్యకర్తలతో వెనుతిరిగారు.

నాటుసారా జోరు

- తొండంగి, తుని, కోటనందూరు, రౌతులపూడి మండలాల్లో భారీగా నాటుసారా స్థావరాలు
- కట్టడి చేయాలంటున్న గ్రామస్తులు



తొండంగి మండలంలో పెద్దఎత్తున పట్టుబడిన సారా ముడి సరుకుతో ఎస్ఈబీ పోలీసులు

తుని రూరల్, మార్చి 17: దశలవారీగా మద్యనిషేధం చేస్తామని.. నాటుసారా కనిపించకుండా చూస్తామని ముఖ్యమంత్రి జగన్ హామీలు ఇచ్చినప్పటికీ జిల్లాలో నాటుసారా ఏరులైపారుతోంది. పల్లెలతోపాటు పట్టణాల్లో ఎక్కడికక్కడే లభ్యమవుతోంది. సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన నేపథ్యంలో ఫోన్ చేస్తే చాలు వారికాళ్ల దగ్గరకు తెచ్చి సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. రెండు నెలల కిందట తుని జగన్నాథగిరి సమీపంలో ఓ పాత మోటారుసైకిల్‌పై పెద్దఎత్తున సారా ప్యాకెట్లు తీసుకెళ్తూ ఓ వ్యక్తి పట్టుబడ్డాడు. ఈసారాను ప్రత్తిపాడు నియోజకవర్గమైన జగన్నాథపురం గ్రామం నుంచి తుని పట్టణానికి అమ్మేందుకు తీసుకెళ్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఇలాంటి ఉదంతాలు మెట్టలో ఎన్నో ఉన్నాయి. గతంతో పోల్చి తే జిల్లాలో నాటుసారాతయారీ, అమ్మకాలు భారీగా పెరిగాయి. మెట్ట ప్రాంతంతోపాటు తీర ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న గ్రామాల్లో సారా తయారీ స్థావరాలు కోకొల్లలుగా ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ఎస్ఈబీ పోలీసులు అడపాదడపా చేస్తున్న దాడుల్లో వేలాది లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేయడంతోపాటు సారాను సీజ్ చేస్తున్నారు. ఒక్క తొండంగి, తుని, కోటనందూరు, రౌతులపూడిల్లో ప్రతి మండలంలో 20 నుంచి 30 చోట్ల నాటుసారా స్థావరాలు ఉన్నట్లు సమాచారం.

పాత వాహనాలపై రవాణా..

పాత ద్విచక్ర వాహనాలే సరుకు రవాణాకు సాధనాలుగా ఉపయోగిస్తున్నారు. ఏదొక సమయంలో పోలీసులకు దొరికినా స్టేషన్‌లో బండి ఉండిపోయినా నష్టం ఏమీలేదని సారా తరలింపునకు పాత మోటార్‌సైకిళ్లనే ఎంచుకుంటున్నారు. కొన్ని చోట్ల ఆటోల్లో ప్రయాణికుల మాదిరి చలామణి అవుతూ తరలిస్తున్నారు. అనుమానం రాకుండా ప్లాస్టిక్ కవర్లలో కట్టి బ్యాగుల్లో వేసుకుని ఆర్టీసీ బస్సులు, రైళ్లు ఎక్కి వస్తున్నారు.

పెరుగుతున్న వ్యాధిగ్రస్తులు

ఆస్పత్రులకు వ్యాధిగ్రస్తులో వందమందిలో ఇద్దరు ముగ్గురు సారా బాధితులు ఉంటున్నారు. ముఖ్యంగా 30 నుంచి 60 ఏళ్ల వారే వస్తున్నారని వైద్యులు అంటున్నారు. గొంతునొప్పి, గుండె వేగంగా కొట్టుకుంటోందని, ఏమీ తినాలనిపించడం లేదని, మూత్రం సరిగా రావడంలేదని, ఆందోళగా ఉంటోందని చెబుతున్నారు. వారిలో కిడ్నీ, కాలేయం, ఊపిరితిత్తులు దెబ్బతినే పరిస్థితులు కనిపిస్తున్నాయని, వీరిలో కొంతమందిని మెరుగైన వైద్యం నిమిత్తం జిల్లా ఆస్పత్రులకు తరలిస్తున్నట్లు వైద్యులు తెలుపుతున్నారు. మద్యం దుకాణాల్లో రెండు, మూడు వందలు పైబడి డబ్బులు వెచ్చించలేక ఎక్కువశాతం రోజువారీ కూలీలు లీటరు రూ.50కే దొరికే ఈ నాటుసారాను సేవిస్తున్నారు.

వేల లీటర్ల సారా స్వాధీనం

ప్రభుత్వం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) పేరుతో ఆబ్కారీ, పోలీస్ మరికొన్నిశాఖలతో ఒక విభాగంగా ఏర్పాటు చేసింది. తుని ఎస్ఈబీ పోలీస్‌స్టేషన్ పరిధిలో సారా విక్రయిస్తున్నవారిపై 1917 కేసులు నమోదు చేసి 25,131లీటర్ల సారా స్వాధీనపరుచుకున్నారు. సారా స్థావరాలపై దాడులు చేసి లక్షలాది లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. అడపాదడపా ఈ దాడులు చేసినా క్షేత్రస్థాయిలో వీటి కట్టడి ఏ మాత్రం తగ్గడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు.

ఘాటు తగ్గుతున్న ఎండుమిర్చి

- వ్యాపారులకు లాభాలు..
- రైతులకు నష్టాలు
- రూ.150 నుంచి రూ.100కు పడిపోయిన ధర



యర్రంపాలెంలో ఉన్న మిరపకాయ కల్లం

గండేపల్లి, మార్చి 17: ఎండుమిర్చి రైతులకు రెండేళ్లుగా దిగుబడి బాగుండడంతో లాభాలు భాగానే కలిసొచ్చాయి. ఈ ఏడాది వాతావరణం అనుకూలించకపోవడంతో వర్షాల ప్రభావంతో పంట పూర్తిగా దిగుబడి కోల్పోయి నష్టాల బాట పట్టారు. కాగా పుండు మీద కారం చల్లినట్లు వ్యాపారులు కాయల్లో నాణ్యత లేదంటూ క్వింటా రూ.20వేలు పలకాల్సిన ధర రూ.15వేలకే కొనుగోలు చేస్తున్నారు. వీలును బట్టి ధర తగ్గించేస్తూ కల్లాల వద్ద కొనుగోలు చేసి మార్కెట్‌లో క్వింటా రూ.20వేలకు పైగా అమ్ముకుని వ్యాపారులు లాభాలు ఆర్జిస్తున్నారు. ఇటు అహర్నిశలు కష్టపడినా రైతుకు మాత్రం నష్టాలే మిగిలాయి. ఇప్పటివరకు రూ.130కు కొన్న ధర మరీ తక్కువ రూ.100కే వ్యాపారస్తులు అడుగుతున్నారని పలువురు రైతులు వాపోతున్నారు. ఇప్పటికే 70శాతంపైగా ఎండుమిర్చిని వ్యాపారులు కొనుగోలు చేశారు. ఇంకా 30శాతం పంట రేటు పెరుగుతుందని రైతులు నిల్వ వేసుకున్నారు. ఇప్పుడు ధర ఇంకా తగ్గిపోవడంతో ఏం చేయాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. వ్యాపారులకు లాభాలు మిగిల్చిన ఎండు మిర్చి రైతులకు మాత్రం నష్టాలను మిగిల్చింది. రైతులు చెప్పిన ధర లేదని వ్యాపారులు నిర్ణయించే ధరకే కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడికి అప్పు తెచ్చుకున్న సొమ్ము కూడా తీర్చే పరిస్థితి లేని సమయంలో తాము నిల్వ ఉంచుకున్న పంటను తక్కువ ధరకే కొనుగోలు చేసేందుకు వ్యాపారులు సిద్ధమవడం బాధాకరమని రైతులంటున్నారు. గండేపల్లి మండలంలో 500 ఎకరాల్లో పైగా ఈ పంటను రైతులు సాగుచేస్తున్నారు.


తొడగొడుతున్న యువతి..


పల్నాడు జిల్లా బొప్పూడి ప్రజాగళం సభకు హాజరైన జనం


ప్రజాగళం సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు, మోదీ, పవన్


ప్రజాగళం సభకు వస్తున్న అమరావతి మహిళలు




ప్రజాగళం సభలో మూడు పార్టీల అభిమానులు

ప్రజాగళం.. ప్రభంజనం

జనం జనం ప్రభంజనం.. బొప్పూడి ప్రజాగళం జనసంద్రమైంది. ఆదివారం భానుడు భగభగ మండిస్తున్నా తగ్గేదిలేదన్నట్లుగా తరలివచ్చిన అశేష జనం హర్షాతిరేకాలతో బొప్పూడి సభా ప్రాంగణం దద్దరిల్లింది. బొప్పూడికి ఇటు చిలకలూరిపేట, అటు మార్టూరు వరకు 16వ నెంబరు జాతీయ రహదారి జనంతో నిండిపోయింది. యువకులు వృద్ధులు, మహిళలు పిల్లలు అన్న తేడా లేకుండా అన్ని వర్గాల వారు కూటమి జెండాలు చేబూని బొప్పూడి వైపు కదలిరావడంతో జాతీయ రహదారిపై జన సునామీ ఆవిష్కృతమైంది. చలో బొప్పూడి అంటూ కార్యకర్తలు, నేతలు, అభిమానులు ఒక ప్రవాహంలా తరలిరావడంతో మధ్యాహ్నం మూడు గంటలకే సభా ప్రాంగణం మొత్తం జనంతో కిటకిటలాడింది. జనసునామీని చూసిన అధినేతలు ఆనందపరవశులయ్యారు. మోదీ అయితే చంద్రబాబును ప్రత్యేకంగా అభినందించారు. బొప్పూడి వేదికగా త్రిమూర్తులైన ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ, జనసేన అధి నేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎన్నికల శంఖారావం పూరించారు. అభివృద్ధి లేక అప్పులు.. దోపిడీ దాష్టీకాలు.. అవినీతి అప్రజాస్వామిక పాలనను అంతం పలకాలని నేతలు పిలిపిచ్చారు. జెండాలు వేరైనా అజెండా ఒకటేనని.. అభివృద్ధి, సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ కావాలంటే కూటమికి ఓటేసి ఆశలు, ఆకాంక్షలు, సాకారం చేసుకోవాలని సందేశమిచ్చారు.

- చిలకలూరిపేట




ఉత్సాహంగా యువతులు..


బాబు,పవన్, పురందేశ్వరి అభివాదం...


మోదీతో బాబు మాటామంతీ..


జానపదుల నృత్యాలు..


మహిళలు, కార్యకర్తల ఉత్సాహం..





వాడపల్లిలో ఘనంగా స్వర్ణ శిఖర ప్రతిష్ఠ



ఆత్రేయపురం, మార్చి 17: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వర్ణ శిఖర ప్రతిష్ఠ ఆదివారం కన్నుల పండువగా జరిగింది. శ్రీవారి ఆలయంతో పాటు క్షేత్ర పాలకులైన అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి, మహాలక్ష్మి అమ్మవారి ఉపాలయాలకు స్వర్ణ కలశ ప్రతిష్ఠ జరిగింది. వైఖానస ఆగమం ప్రకారం ఖండవల్లి వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో ఉదయం 10.22 గంటలకు వేద మంత్రాలు, మంగళవాయిద్యాలు భక్తుల గోవింద నామస్మరణ మధ్య నిర్వహించారు. ప్రధాన హోమం, మహా పూర్ణాహుతి, స్వామివారికి జీవకళావాహన, పుష్కర నదీ జలాలతో అభిషేకం, వేదాశీర్వచనం జరిపారు. కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సహకారంతో రూ.35 లక్షల వ్యయ దాతలు తాడి నాగమోహనరెడ్డి, మేడపాటి సిద్ధార్థరెడ్డి, చిర్ల వాసురెడ్డి, ధర్మకర్త పి.సురేష్‌రాజు, ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో భూపతి రాజు కిశోర్‌కుమార్, ధర్మకర్తల మండలి సభ్యులు ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్నారు. వేలాది మంది భక్తులు తిలకించి తన్మయత్వం పొందారు.


శిఖర ప్రతిష్ఠకు తరలివచ్చిన భక్తులు

202 కిలోల గంజాయి పట్టివేత


గంజాయి నిందితులతో పోలీసులు

రావులపాలెం, మార్చి17: జాతీయ రహదారిపై వాహనంలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. రావులపాలెం పోలీస్ స్టేషన్ వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను ట్రైనీ డీఎస్పీ విష్ణుస్వరూప్ వెల్లడించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ఈతకోట జాతీయ రహదారిపై ట్రైనీ డీఎస్పీ విష్ణుస్వరూప్, ఎస్ఐలు ఎం.ప్రేమ్‌కుమార్, జ్వాలాసాగర్ కానిస్టేబుళ్లు పి.విజయకుమార్, గోపి, త్రిమూర్తులు, శ్రీనివాస్‌లతో కలిసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. రావులపాలెం నుంచి తణుకు వైపు వెళ్తున్న ఏపీ 02 ఏడీ 3887 మహేంద్ర జైలో వాహనాన్ని ఆపి చూడగా అందులో గంజాయి ఉన్నట్టు గుర్తించారు. గంజాయి, కారు, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఒడిసా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లా కెందుగూడ గ్రామానికి చెందిన దమా కొంతేరి, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా కుంహరాస్ గ్రామానికి చెందిన సతీష్‌విశ్వాస్ 202 కిలోల గంజాయి తరలిస్తున్నట్టు నిర్ధారించారు. గంజాయి విలువ రూ.10 లక్షలు, వాహనం విలువ రూ.2.50 లక్షలుగా పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పోటీలు


విజేతకు షీల్డ్ అందిస్తున్న ఎంపీ వంగా గీత

పిఠాపురం రూరల్, మార్చి 17: కాకినాడ జిల్లా పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడు గ్రామంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎడ్లపరుగు పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. పోటీలను తిలకించేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు. సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో పోటీలు జరిగాయి. విజేతలకు కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ షీల్డులు బహుకరించారు. సీనియర్స్ విభాగంలో అనకాపల్లి జిల్లా లెక్కలవాని పాలానికి చెందిన పైడితల్లి అమ్మ తల్లికి చెందిన ఎడ్లజత నిర్దేశించిన దూరాన్ని 6 నిమిషాల 21 సెకన్ల సమయంలో పరుగెత్తి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, మండపేట వేగుళ్ల తేజ ఎడ్ల జత 6-33-15 సమయంలో, గుమ్మిలేరు కోరా వీర వెంకట సత్యవేణి ఎడ్లజత 6-37-69 సమయంలో పరుగెత్తి ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. జూనియర్స్ విభాగంలో గుమ్మిలేరుకు చెందిన కోరా వీరవెంకట సత్యవేణి ఎడ్లజత 4-36-28 సమయంలో, యర్రంపాలెంకు చెందిన ఇజ్జిన శ్రీను ఎడ్లజత 4-37-56, కొప్పవరం బండారు శ్రీను మెమోరియల్ ఎడ్లజత నిర్దేశిత దూరాన్ని 4-38-13 సమయంలో పరుగెత్తి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి.

బొలెరో వ్యాన్ ఢీకొని ఇద్దరు యువకుల మృతి


వెంకటేష్ మృతదేహం


ముత్తా హరిసాయి


పొలిమేరు వెంకటేష్

కిర్లంపూడి, మార్చి17: బొలెరో వ్యాన్ ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందారు. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం రాజుపాలెంలో ఈ విషాదకర సంఘటన జరిగింది. కిర్లంపూడి ఎస్ఐ జబీర్ తెలిపిన వివరాలు ప్రకారం... ఆదివారం సామర్లకోట నుంచి కిర్లంపూడికి బైక్‌పై కిర్లంపూడి రమణయ్యపేటకు చెందిన వార్డు మెంబర్ ముత్తా పెదకాపు రెండో కుమారుడు హరిసాయివెంకటఅప్పారావు(20), జగపతినగరం కొత్తపేటకు చెందిన పొలిమేరు వెంకటేష్(20) వస్తున్నారు. వారు రాజుపాలెం వచ్చేసరికి బొలెరా వ్యాన్ ఢీకొట్టడంతో వెంకటేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. హరిసాయిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ జబీర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇద్దరు యువకులు మృతి చెందడంతో ఆయా కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. పోస్టుమార్టం నిమిత్తం ప్రత్తిపాడు ఆస్పత్రికి తరలించి ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌లను ఢీకొన్న కారు: యువకుడి మృతి


గంగాధర్ ఫైల్‌ఫొటో

ప్రత్తిపాడు, మార్చి17: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు- ధర్మవరం జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒక యువకుడు మృతిచెందగా మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచి గ్రామానికి చెందిన తాడి గంగాధర్(నవీన్)(29), తాడి రాజేష్, గుడాల సురేష్ ఒక బైక్‌పైన, గొల్లప్రోలు మండలం వెల్దుర్తికి చెందిన అన్నదమ్ములు ములికి సత్యనారాయణ, ములికి ఉమాశంకర్ మరో బైక్‌పైన ప్రత్తిపాడు వస్తుండగా తిరుమల రెస్టారెంట్ వద్ద విజయవాడ వెళుతున్న కారు రెండు బైక్‌లను ఢీకొంది. ఈ దుర్ఘటనలో తాడి గంగాధర్ మృతి చెందగా మిగిలిన నలుగురు తీవ్రంగా గాయపడ్డారు.

ఇల్లు కట్టుకుందామని వచ్చి

హైదరాబాద్‌లో మందుల కంపెనీలో పని చేస్తున్న తాడి గంగాధర్ (నవీన్) తన స్వగ్రామం ఉత్తరకంచిలో ఇల్లు నిర్మించుకుందామని వచ్చి రోడ్డు ప్రమాదంలో మృత్యువాడ పడ్డాడు. గంగాధర్‌కు భార్య సుధారాణి, పిల్లలు ఉన్నారు. కుటుంబానికి ప్రధాన ఆధారమైన గంగాధర్ ఇలా మృతి చెందడంతో అతని కుటుంబ సభ్యులు షాక్‌కు గురై పుట్టెడు దుఃఖంలో మునిగిపోయారు.

మరో ప్రమాదంలో

ధర్మవరం పాడికాలువ వద్ద జాతీయ రహదారిపై ధర్మవరం నుంచి కత్తిపూడి వైపు బైక్‌పై వెళుతున్న బి.లక్ష్మి, బి. రాజేష్, బి. వైష్ణవిని లారీ ఢీకొంది. దీంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని చికిత్స కోసం అంబులెన్స్‌లో స్థానిక ఆస్పత్రికి తరలించారు.

ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దుల్లో తనిఖీలు


తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ఎటపాక, ఏప్రిల్ 17 సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన కన్నాయి గూడెం వద్ద ఆదివారం పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఛత్తీస్‌గఢ్ నుంచి ఏపీ మీదుగా రాకపోకలు సాగించే వాహనాలతో పాటు తెలంగాణ నుంచి ఛత్తీస్‌గఢ్ వైపు వెళ్లే వాహనాలను సీఐ రామారావు, ఎస్ఐ పార్థసారథి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. మద్యం, నగదు తరలిస్తున్నారనే దానిపై సోదాలు జరిపారు. అనుమానిత వ్యక్తులను ప్రశ్నించారు. నెల్లిపాక వద్ద హైవేపై అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు.

వైభవంగా లక్ష కుంకుమార్చన


లక్ష కుంకుమార్చన పూజ నిర్వహిస్తున్న దృశ్యం

గొల్లప్రోలు రూరల్, మార్చి 17: గొల్లప్రోలు మండలంలోని తాటిపర్తి గ్రామంలో వేంచేసి ఉన్న అపర్ణాదేవికి ఆదివారం లక్ష కుంకుమార్చన వైభవంగా జరిగింది. అపర్ణా సమేత నాగేశ్వరస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. కుంకుమార్చనకు మహిళా భక్తులు విశేషంగా తరలివచ్చారు. వేద పండితులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రభాకరశాస్త్రి పూజాది కార్యక్రమాలు జరిపించారు. ఉదయం సూర్యనారాయణమూర్తికి అభిషేకం, అర్చన నిర్వహించారు. కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి రాగి డాలర్, శేషవస్త్రం, పూజా కుంకుమ, ప్రసాదం అందజేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం లలితా సహస్ర హోమం, మహా సౌరహోమం ఘనంగా జరిగింది. కాగా స్వామి, అమ్మవార్లను పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ గారపాటి బుజ్జి, ప్రధాన కార్యవర్గ సభ్యుడు దాసం వెంకటేష్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గోదావరిలో మునిగి పారిశుధ్య కార్మికుడి మృతి


నవీన్‌సాగర్

రాజమహేంద్రవరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ గోదావరిలో మునిగి ఓ పారిశుధ్య కార్మికుడు దుర్మరణం చెందాడు. రాజ మహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్‌లో కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న తాడితోట రెల్లిపేటకు చెందిన నిమ్మకాయల నవీన్ సాగర్(35) ఆదివారం సాయంత్రం పూజా సామగ్రి గోదావరిలో కలపడానికి పుష్కరఘాట్‌కు వెళ్లాడు. గోదావరిలో కాస్త లోతుకు వెళ్లగా ఫిట్స్ రావడంతో మునిగి చనిపోయి ఉంటాడని త్రీటౌన్ పోలీసులకు అతడి సంబంధీకులు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుమన్నామని సీఐ వీరయ్య గౌడ్ తెలిపారు.

నేడు 'స్పందన, డయల్ యువర్ కమిషనర్' రద్దు

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 17: సోమవారం జరగాల్సిన డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను రద్దు చేసినట్టు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలులోకి వచ్చినందున ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. నగర ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాల్సిందిగా ఆయన కోరారు.



బెండపూడిలో ప్రచారం నిర్వహిస్తున్న యనమల దివ్య

'ఓటు వేసి ఆశీర్వదించండి'

తొండంగి, మార్చి 17: అభివృద్ధి, సంక్షేమం కోసం పాటుపడే టీడీపీ, జనసేన కూటమిని బలపర్చి తనకు ఓటు వేసి ఆశీర్వదించాలని తుని నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యనమల దివ్య ప్రజలను కోరారు. ఆదివారం ఆమె బెండపూడిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంచి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలంటే తమ కూటమి అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు యనమల శివరామకృష్ణ, యనమల రాజేష్, పేకేటి హరికృష్ణ, సాధనాల నూకరాజు, పాలచర్ల యర్రబ్బు, గోపాలం, కోరుకొండ శివ, టీడీపీ, జనసేన పార్టీల తొండంగి మండలాధ్యక్షులు చొక్కా అప్పారావు, బెండపూడి నాయుడు తదితరులున్నారు.

'ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు కృషి'

సర్పవరం జంక్షన్, మార్చి 17: రాబోయే ఎన్నికల్లో టీడీపీ అధిష్టానం ఆదేశాల మేరకు జనసేన ఉమ్మడి అభ్యర్థి గెలుపుకు కృషి చేస్తానని, తన వెంట ఉన్న కార్యకర్తలకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటానని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస బాబా అన్నారు. ఆదివారం రమణయ్యపేట ఒకటో డివిజన్ కాపుల రామాలయం వద్ద గుడి వద్ద పార్టీ కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. బాబా మాట్లాడుతూ టీడీపీ బలోపేతం కోసం తన శాయశక్తులా కృషి చేశానన్నారు. పార్టీ పదవుల నియామకంలో కనీసం తను సంప్రదించకుండా నిర్ణయం తీసుకోవడంతో మనస్థాపానికి లోనవ్వడం జరిగిందన్నారు. పార్టీపై ఉన్న అభిమానంతో పార్టీ సూచించిన కాకినాడ రూరల్ జనసేన-టీడీపీ ఉమ్మడి నానాజీ అభ్యర్థి విజయానికి కృషి చేస్తానన్నారు. మాజీ జడ్పీటీసీ కాకరపల్లి సత్యవతిచలపతిరావు పాల్గొన్నారు.

'ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి'

కరప, మార్చి 17: కొవిడ్ అనంతర పరిణామాల నేపథ్యంలో ప్రతీఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు బొండా సూర్యారావు సూచించారు. కరప చిరంజీవి కల్యాణమండపంలో ఆదివారం ఏర్పాటుచేసిన మెగా ఉచిత వైద్యశిబిరంలో ఆయన మాట్లాడారు. మారుతున్న కాలానికనుగుణంగా జీవన ప్రమాణాలను పెంపొందించుకునేందుకు కృషిచేయాలన్నారు. ప్రముఖ వైద్యులు ముమ్మిడి శ్రీరామారావు, నున్న నరసింహరావుల జ్ఞాపకార్థం ప్రవాసాంధ్ర వైద్య నిపుణుల సంఘం ఆధ్వర్యంలో ఈ శిబిరం జరిగింది. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు, జడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతికుమార్ శిబిరాన్ని ప్రారంభించారు. వందలాది మందికి వివిధ విభాగాలకు చెందిన 14మంది వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, మాజీ ఉపసర్పంచ్ దూడల నారాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'బీసీలంతా ఐక్యమత్యంతో పదవులను చేపట్టాలి'

తాళ్లరేవు, మార్చి 17: బీసీలంతా ఐక్యమత్యంతో చట్టసభల పదవులను చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశన శంకరరావు అన్నారు. ఆదివారం సుంకరపాలెం పంచాయతీ చింతాకులవారిపేటలో బహిరంగసభను బొంతు సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ ప్రముఖులు మాట్లాడుతూ ఓట్లు మనవి సీట్లు అగ్రవర్ణాలవని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల ఆలోచన విధానం మారితే మనోట్లు మనమే వేసి రాజ్యాధికారం చేపట్టాలన్నారు. అనంతరం రాష్ట్ర సంఘం ప్రచార కార్యదర్శిగా ఎంపికైన బొంతు శ్రీనివాస్‌ను సత్కరించారు. కార్యక్రమంలో బీసీ నేతలు కర్రి క్రాంతికుమార్, సర్పంచ్‌లు టిల్లపూడి నాగేశ్వరరావు, ముద్దన శివరామప్రసాద్, ఎంపీటీసీ గుత్తుల శ్రీను, చొల్లంగి వేణుగోపాల్, కాదా గోవిందకుమార్, కుడిపూడి శివన్నారాయణ, పిల్లి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల వయోపరిమితిని పెంచాలి'

పిఠాపురం, మార్చి 17: గురుకుల ఉపాధ్యాయుల వయోపరిమితిని తక్షణం పెంచాలని ఆల్ ఇండియా పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్, అప్సా ఏపీ, తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పిల్లా చంద్రం డిమాండ్ చేశారు. ప్రభుత్వశాఖలతో పాటు ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికుల పదవీ విమరణ వయస్సును 62 ఏళ్లకు పెంచారని తెలిపారు. అయితే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో పనిచేస్తున్న వారి పదవీ విరమణ వయస్సు పెంచకుండా వైసీపీ సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని, ఇక్కడ ప్రభుత్వ ఆదేశాలు ఎందుకు అమలు కాలేదో సీఎం సమాధానం చెప్పాలని కోరారు.

'వైసీపీ ప్రభుత్వాన్ని నమ్మవద్దు'

తాళ్లరేవు, మార్చి 17: ఒక్కసారి చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ మోసకారి ప్రభుత్వాన్ని నమ్మి మరోసారి మోసపోవద్దని టీడీపీ నేతలు నడింపల్లి వినోద్, రోళ్ల శ్రీనివాస చక్రవర్తి అన్నారు. ఆదివారం తాళ్లరేవు ముత్యాలమ్మతల్లికి పూజలు చేసి ప్రచారం ప్రారంభించారు. ఇంటింటా టీడీపీ,జనసేన కూటమి ప్రజలకు ఇచ్చిన మేనిఫెస్టోలో ఉన్న పథకాలను వివరించి తమ అమూల్యమైన ఓట్లను సైకిల్‌పై వేసి టీడీపీని గెలిపించాలని కోరారు. సమన్వయకర్త ధూళిపూడి వెంటరమణ, గంటా రమేష్, వాకపల్లి చిట్టిబాబు, నేరేడుమిల్లి బుజ్జి, కుడిపూడి దుర్గాప్రసాద్, నలుకుర్తి ఏడుకొండలు, గంజా సూరిబాబు, వాసంశెట్టి శ్రీనివాస్, పితాని హేమలత, గోవిందు ఉన్నారు.

'ఫార్మాసిస్టుల పాత్ర ఎంతో కీలకం'

పెద్దాపురం, మార్చి 17: ఆరోగ్య పరిరక్షణలో ఫార్మాసిస్టుల పాత్ర ఎంతో కీలకమని ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ విలియం కేరీ అన్నారు. ఆదివారం మండలంలోని దివిలి కిట్స్ ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఎమర్జింగ్ ట్రెండ్స్ అండ్ ఇన్నోవేషన్స్ కాన్ఫరెన్స్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఫార్మాసిస్టుగా నమోదుకు ఫార్మసీ కౌన్సిల్ మార్గదర్శకాల అనుసరించి సులభంగా నమోదు చేసుకోవచ్చని, ఫార్మసీ విద్యలో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. కళాశాల చైర్మన్ బేతినీడి శ్రీనివాసరావు, డాక్టర్ పులిపాటి సౌజన్య పాల్గొన్నారు.

రేపటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

పిఠాపురం, మార్చి 17: తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహణలో పట్టణంలో ఉన్న పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈనెల 26 వరకూ జరిగే ఈ ఉత్సవాలకు టీటీడీ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. 19న ఉదయం సుప్రభాతం, అభిషేకం, దీక్ష తిరుమంజనం, సాయంత్రం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, దీక్షా కంకణం, బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరుగుతాయి. 20న ఉదయం ధ్వజారోహణం, స్నపన తిరుమంజనం, రాత్రి శాంతి కల్యాణం, 21న తోమలా అర్చన, చతుస్థానార్చన, గరుడ వాహనంపై స్వామి గ్రామోత్సవం, 22న అభిషేకం, శుద్ధి, అలంకారం, సాయంత్రం ఊంజల్‌సేవ, 23వ తేదిన స్నపన తిరుమంజనం, 24న ఊంజల్‌సేవ, 25న చక్రస్నానం, సాయంత్రం ధ్వజఅవరోహణం, పూర్ణాహుతి, కుంభప్రోక్షణ, శాత్తుమొఱ, విద్వత్ సంభావన, 26 రాత్రి ద్వాదశారాధన పూర్వక శ్రీపుష్పయాగం నిర్వహిస్తారు. కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని టీటీడీ టెంపుల్ ఇనస్పెక్టర్ సందీప్ కోరారు.

గొల్లప్రోలులో పోలీసుల కవాతు

గొల్లప్రోలు, మార్చి 17: పట్టణంలో పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు ఆదివారం కవాతు నిర్వహించాయి. ప్రధాన రహదారుల మీదుగా మార్చ్ చేశారు. అనంతరం రాయవరం సెంటర్‌లో ప్రజలనుద్దేశించి అధికారులు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, పిఠాపురం సీఐ శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ మురళీమోహన్ తదితరులున్నారు.

'ఆదిత్య'లో అతిథి ఉపన్యాసం

గండేపల్లి, మార్చి17: సూరంపాలెంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల అగ్రికల్చర్ ఇంజనీరింగ్ విభాగంలో సాంకేతిక వ్యవసాయ శక్తి, యంత్రాలలో అత్యాధునిక టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన కలిగించేందుకు అతిథి ఉపన్యాసం ఏర్పాటు చేసినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. రిసోర్స్‌పర్సన్‌గా సీనియర్ లీడ్ ఇంజనీర్ జాన్ డీర్ ఇండస్ట్రియల్ కంపెనీ విశేష అనుభవం కలిగిన గోపీచంద్ విచ్చేసి పలు అంశాలపై అవగాహన కల్పించారు. విభాగాధిపతి డాక్టర్ బి.కృష్ణకాంత్ ఉన్నారు.

ఫ్రెషర్స్ డే వేడుకలు

జేఎన్టీయూకే, మార్చి 17: వర్సిటీలోని అలూమ్నీ ఆడిటోరియంలో యూసీఈకే బీటెక్ ప్రథమసంవత్సర విద్యార్థులకు ఫ్రెషర్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన పలు క్రీడా పోటీలలోని విజేతలకు జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు ప్రతిభాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో రెక్టార్ కేవీరమణ, రిజిస్ట్రార్ ఎల్.సుమలత, యూసీఈకే ప్రిన్సిపాల్ ఎంహెచ్ఎం కృష్ణప్రసాద్, వర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ జి.శ్యామ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

తరలిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు

ప్రజాగళం బహిరంగ సభకు కార్లలో నాయకులు, కార్యకర్తల పయనం



జగ్గంపేటలో బయలుదేరిన నెహ్రూ, శ్రేణులు



గండేపల్లి: కార్లలో తరలివెళ్తున్న నాయకులు

జగ్గంపేట, మార్చి 17: టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం చిలకలూరిపేట మండలం బొప్పూడిలో జరిగిన ప్రజాగళం భారీ బహిరంగ సభకు జగ్గంపేటలో నియోజకవర్గ శ్రేణులు 300 కార్లలో తరలివెళ్లారు. రావులమ్మ తల్లి ఆలయం వద్ద నుంచి ఉదయం 9గంటలకు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎస్వీఎస్ అప్పలరాజు, కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, కోర్పు సాయితేజ, మారిశెట్టి భద్రం, పోతుల మోహన్‌రావు, మంగ రౌతు రామకృష్ణ, చదరం చంటిబాబు, కందుల చిట్టిబాబు, పరిమి బాబు, జాస్తి వసంత్, కుంచే రాజా, దాసరి తమ్మన్న దొర, దేవరపల్లి మూర్తి,అనుకూల శ్రీకాంత్,నీలంశ్రీను, కందుల బాబ్జి,కంటే సురేంద్ర, బస్వా వీరబాబు, తూముకుమార్, టీడీపీ, జనసేన నాయకులున్నారు.

గండేపల్లి: గండేపల్లి మండలం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సుమారు 100 కార్లలో జగ్గంపేటలో టీడీపీ కార్యాలయానికి చేరుకుని అక్కడ నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ వెంట కాన్వాయ్‌గా బయల్దేరి వెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహన్‌రావు, కందుల చిట్టిబాబు, బొల్లంరెడ్డి రామకృష్ణ, పరిమిబాబు, జాస్తి వసంత్, సుంకవిల్లి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

కాకినాడ సిటీ: బొప్పూడిలో జరిగిన ప్రజాగళం బహింగసభకు సిటీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు పయనమై వెళ్లారు. కాకినాడ నుంచి ప్రత్యేక బస్సుల్లో ర్యాలీగా బయలుదేశారు. నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, గ్రంధి బాబ్జి, విశ్వనాదం, రవి, సాయిబాబా, చిన్నా, రమేష్, బాలాజీ, అమర్ జైన్, అప్పలకొండ, రాజు తదితరులు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్: బొప్పూడిలో భారీ బహిరంగ సభకు టీడీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గ కోకోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ) ఆధ్వర్యంలో సర్పవరం జంక్షన్ నుంచి 20 కార్లలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కరప మండలాధ్యక్షుడు దేవు వెంకన్న, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు కొల్లా బత్తుల అప్పారావు, జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు మట్టా ప్రకాశ్‌గౌడ్, కొజు నెహ్రూ, బచ్చల కామేశ్వరరావు, కోన వెంకటలక్ష్మి, వెంకటేశ్వరరావు ఉన్నారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు నియోజకవర్గ ఉమ్మడి పార్టీల అభ్యర్థి వరుపుల సత్యప్రభరాజా నాయకులు,కార్యకర్తలతో తరలివెళ్లారు. తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, టీడీపీ రాష్ట్ర నేతలను ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ టీడీపీ నాయకులు బొదిరెడ్డిగోపి, మణికంఠ, గీద, నానాజీ పాల్గొన్నారు. ఒమ్మంగి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రామిశెట్టి కన్నయ్య, మాజీ సొసైటీ అధ్యక్షుడు సుంకర రాజా, గ్రామపెద్దలు, నాయకులు ప్రత్తిపాడు వచ్చి సత్యప్రభకు సంఘీభావం తెలిపారు. సత్యప్రభ విజయానికి కృషి చేస్తామన్నారు.

సామర్లకోట: సామర్లకోట నుంచి టీడీపీ, బీజేపీకి చెందిన వందలాది కార్యకర్తలు, నాయకులు సుమారు 250 కార్లలో తరలి వెళ్లారు. ఎమ్మెల్యే చినరాజప్ప తనయుడు రంగనాగ్ ఆధ్వర్యంలో కార్ల ర్యాలీగా వెళ్లారు. రాజప్ప శనివారం సాయంత్రం నుంచీ బొప్పాడిలోనే ఉండి సభా ఏర్పాట్లు పర్యవేక్షించారు.

తుని రూరల్: తుని నుంచి ప్రజాగళం బహిరంగ సభకు పెద్దఎత్తున తరలివెళ్లిన బస్సులను జెండాలకు తుని టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుర్ల లోవరాజు, యనమల రాజేష్, చింతమనీడి నాగ సోమరాజు, మోతుకూరి వెంకటేష్, చోడిశెట్టి వెంకటేష్, పోలిశెట్టి రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

కోటనందూరు: తుని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య సమక్షంలో కోటనందూరు మండలం నుంచి టీడీపీ, జనసేన,బీజేపీ కార్యకర్తలు భారీసంఖ్యలో 3 బస్సులు, 10 కార్లులో తరలివెళ్లారు.



కాకినాడ సిటీ: సభకు వెళ్తున్న కొండబాబు, నేతలు

ఎన్నికల నిబంధనలు వీటికి వర్తించవా?

ఎన్నికల కోడ్ వచ్చినా తొలగించని ఫ్లెక్సీలు



బి.ప్రత్తిపాడు జంక్షన్ వద్ద ఉన్న ఫ్లెక్సీ

పిఠాపురం/గొల్లప్రోలు, మార్చి 17: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా పలుచోట్ల ఉన్న ఫ్లెక్సీలను ఆదివారం రాత్రి సమయానికి తొలగించలేదు. 216వ జాతీయ రహదారిపై పిఠాపురం శివారు ఇల్లింద్రాడ సెంటర్ వద్ద, గొల్లప్రోలు బైపాస్‌రోడ్డులోని బి.ప్రత్తిపాడు జంక్షన్ వద్ద అధికార పార్టీల నేతల ఫ్లెక్సీలు ఇంకా కనిపిస్తున్నాయి. అన్ని పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను తొలగించినప్పటికి వీటిని ఎందుకు వదిలివేశారన్నది ప్రశ్నార్థకంగా మారింది. పలుచోట్ల మా నమ్మకం నువ్వే జగన్ అన్న డిస్‌ప్లే బోర్డులు మాత్రం యధావిధిగా ఉన్నాయి.



పోలేకుర్రు వైజంక్షన్ వద్ద వైసీపీ ఫ్లెక్సీ

తాళ్లరేవు మండలంలో...

తాళ్లరేవు: మండలంలో ఎన్నికలకోడ్ అమలులో ఉన్నప్పటికీ అధికారపార్టీకి చెందిన ఫ్లెక్సీలు, కటౌట్లు తొలగించడం లేదని, ప్రభుత్వ అధికారులు అధికారపార్టీకి కొమ్ముకాస్తున్నారని స్థానికుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. తాళ్లరేవు మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదురుగా కటౌట్లు, జైభీమ్‌పేట 216 రహదారిపై, పోలేకుర్రు వైజంక్షన్, సుంకరపాలెం బైపాస్ సెంటరు, తాళ్లరేవు సొసైటీ కార్యాలయం వద్ద అధికారపార్టీకి చెందిన ఫ్లెక్సీలు, కటౌట్లు ఇంకా కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా తొలగించాలని పలువురు కోరుతున్నారు.

శిలాఫలకం ఏర్పాటుపై నిరసన



నిరసన తెలుపుతున్న టీడీపీ, జనసేన నాయకులు

కాకినాడ రూరల్, మార్చి 17: ప్రస్తుతం ఎన్నికలకోడ్ అమల్లో ఉండగా కాకినాడ రూరల్ మండలం తూరంగి బొడ్డుచెరువు వద్ద ఆదివారం ఉదయం చెరువు పార్కుపనులకు సంబంధించి శిలాఫలకం ఏర్పాటుచేయడంపై గ్రామ టీడీపీ, జనసేన నాయకులు నిరసన తెలిపారు. దీనిపై అధికారులు వెంటనే స్పందించి శిలాఫలకం తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యను ఆర్డీవోకు తెలియజేశామన్నారు. నిరసనలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సబ్బతి ఫణీశ్వరరావు, పలువురు టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పామాయిల్ వ్యర్థాలు దగ్ధం

పెద్దాపురం, మార్చి 17: పెద్దాపురం నుంచి వడ్లమూరు వెళ్లే ప్రధాన రహదారిలో సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో నిల్వ ఉంచిన పామాయిల్ వ్యర్థాలు ఆదివారం దగ్ధమయ్యాయి. భారీ స్థాయిలో పీచు ఆ ప్రదేశంలో నిల్వ చేయడంతో ఎవరో కాల్చిపారవేసిన సిగరెట్ పీక ద్వారా మంటలు వ్యాప్తి చెందాయి. పీచు పూర్తిగా ఎండిపోయి ఉండడంతో ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేయడానికి కష్టంమీద అదుపుచేశారు. నష్టం ఎంత అనే దానిపై అగ్నిమాపక శాఖాధికారులు అంచనా వేస్తున్నారు.



తగలబడుతున్న పామాయిల్ వ్యర్థాలు

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



ఏలేశ్వరంలో పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లు

కాకినాడ రూరల్, మార్చి 17: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి 12.45 వరకూ నిర్వహించే ఈ పరీక్షలకు సంబంధించి కాకినాడ అర్బన్ మండలంలో 22 పరీక్షాకేంద్రాలు ఏర్పాటుచేయగా వాటిలో 5380 మంది పరీక్షలు రాయనున్నారని కాకినాడ అర్బన్ డీఐ వీపీజీ వాణీకుమారి తెలిపారు. పరీక్షలకు 300 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులను ఇన్విజిలేషన్ విధులలో నియమించామని, విద్యార్థులు గంట ముందుగానే పరీక్షాకేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఉదయం 9గంటలకు పరీక్షాహాల్లోకి అనుమతిస్తామన్నారు. పరీక్షాకేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన వెలుతురు ఉండే గదులు, మంచి నీరు, లైట్లు, ఫ్యాన్లు సదుపాయాలను ఏర్పాటుచేశామని ఎంఈవో చెవ్వూరి రవి తెలిపారు. పరీక్షలకు మొత్తం 7పేపర్లు ఉంటాయని చెప్పారు.

ఏలేశ్వరం: పదోతరగతి పరీక్షలకు మండలంలో నాలుగు పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఎంఈవో బి.అబ్బాయి తెలిపారు. లింగంపర్తి జడ్పీ హైస్కూల్‌లో 248, ఏలేశ్వరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 233, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో 200, భాష్యం హైస్కూల్‌లో 237 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారన్నారు. ఛీఫ్ సూపరిడెంట్లుగా ఎమ్.రజనీ కుమారి, ఎన్.లక్ష్మీ తులసీ, వట్టి వెంకటరమణ, ఎస్.లక్ష్మణరావు విధులు నిర్వహిస్తారని, మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో 918మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని ఎంఈవో తెలిపారు.

పెద్దాపురం: ఈనెల 18 నుంచి 27 వరకూ నిర్వహించే పదో తరగతి పరీక్షల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ఎంఈవోలు ప్రభాకర శర్మ, చౌదరి తెలిపారు. 28 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలకు సంబంధించిన విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్టు చెప్పారు. అలాగే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు కలిపి 1602 విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు తెలిపారు. పట్టణ పరిధిలో 4, రూరల్ పరిధిలో 3 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు.

కోటనందూరు: మండలంలో పదోతరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామని ఎంఈవో ఏ.శ్రీనివాస్ తెలిపారు. 3సెంటర్లులో మొత్తం 530 మంది విద్యార్థులు పరీక్ష రాస్తారన్నారు. మదర్ హైస్కూల్‌లో 240 మంది, పాతకొట్టాహైస్కూల్ లో 180మంది, కోటనందూరు హైస్కూల్‌లో 210 మంది పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు పరీక్ష సమయానికి గంట ముందే రావాలన్నారు.

సామర్లకోట: 9 పరీక్షాకేంద్రాల్లో 2,205 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాసేలా చర్యలు తీసుకున్నట్లు సామర్లకోట ఎంఈవో వై.శివరామకృష్ణయ్య వెల్లడించారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ పరీక్షలు జరుగుతాయన్నారు. సామర్లకోట జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని ఆయన ఆదివారం సాయంత్రం పరిశీలించారు. మండలంలో సామర్లకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 210 మంది, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 200, అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 290, ప్రతిభ విద్యానికేతన్ పాఠశాలలో 290, వేట్లపాలెం జెడ్పీ ఉన్నతపాఠశాలలో 580, నవర జెడ్పీ ఉన్నతపాఠశాలలో 170, వీకె.రాయపురం జెడ్పీ ఉన్నతపాఠశాలలో 230, ఉండూరు జెడ్పీ ఉన్నతపాఠశాలలో 235 మంది విద్యార్థులు పరీక్షలు రాసేలా ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. హెచ్ఎమ్ యూ.మీనామాధురి పాల్గొన్నారు.

రౌతులపూడి: మండలంలో పదోతరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్టు ఎంఈవో గాడి కొండబాబు తెలిపారు. రౌతులపూడి, మూలగపూడి, ఎ.మల్లవరం సెంటర్లు కేటాయించామన్నారు. రౌతులపూడిలో సెంటర్‌లో 310 మందికి 13 రూమ్‌లు, మూలగపూడి 170 మందికి 8 రూమ్‌లు, ఎ.మల్లవరంలో 130 మందికి 7 రూమ్‌లు సిద్ధం చేశామన్నారు. ప్రతి సెంటర్‌కి 1 ఛీఫ్ సూపరిండెంట్, డిపార్ట్‌మెంటర్ అధికారితో పాటు 30మంది ఇన్విజిలేటర్‌ను నియమించామన్నారు.

కొత్తపల్లి: పదవ తరగతి పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు కొత్తపల్లి ఎంఈవోలు వేణుగోపాల్, పైడిరాజు తెలిపారు. మండలంలో 5 పరీక్షా కేంద్రాల ద్వారా 1220 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. కొత్తపల్లిలో జిల్లా పరిషత్ బాలుర,బాలికల ఉన్నత పాఠశాలలు,మూలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,మూలపేట ఉన్నత పాఠశాల, కొత్తపల్లి వీవీఎస్ పబ్లిక్ స్కూల్‌లో కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల నిర్వహణకు 66మంది ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షా కేంద్రానికి 30నిముషాల ముందే విద్యార్థులు రావాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద మంచినీరు, వైద్య సదుపాయాలను కల్పించినట్టు ఎంఈవోలు తెలిపారు.

'లాన్‌టెన్నిస్ కోర్టుల ఏర్పాటుకు కృషి'



మాట్లాడుతున్న అధ్యక్ష, కార్యదర్శులు

కాకినాడ అర్బన్, మార్చి 17: ప్రతి జిల్లాలో లాన్‌టెన్నిస్ కోర్టుల ఏర్పాటుకు కృషి చేస్తామని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్వర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం లాన్‌టెన్నిస్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో లాన్‌టెన్నిస్ ఆటపై పాఠశాలస్థాయి నుంచి విద్యార్థుల్లో ఆసక్తి కలిగించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కాకినాడలోలానే ప్రతి జిల్లాలోను అనువైన చోట కోర్టులు ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చి కొత్త క్రీడాకారులను ప్రోత్సాహించేందుకు కృషి చేస్తున్నామన్నారు. సంఘ కార్యదర్శి కాకినాడ వాసి పీవీ రామ్‌కుమార్ మాట్లాడుతూ విజయవాడ, విశాఖపట్టణం నగరాలు ఎంపిక చేసుకుని ఉత్సాహవంతులైన క్రీడాకారులను ప్రోత్సహించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక

లాన్‌టెన్నిస్ అసోసియేషన్ రాష్ట్ర సంఘ నూతన కార్యవర్గ ఎన్నికలు కాకినాడ టౌన్‌హాలు ప్రాంగణంలో జరిగాయి. అధ్యక్షుడిగా నెల్లూరుకు చెందిన ఆనం మహేశ్వరకుమార్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బి. మధుసూదన్‌రెడ్డి (వైఎస్‌కడప్‌జిల్లా), గుమ్మిడి వీరమోహన్ (విశాఖ), కార్యదర్శిగా పీవీ రామ్‌కుమార్ (కాకినాడ), కోశాధికారిగా డాక్టర్ యడ్లపల్లి రామ్‌కుమార్ (ఎన్టీఆర్ కృష్ణా), జాయింట్ సెక్రటరీగా జి.నాగరాజాబాబు(అనంతపురం)తో పాటు మరో ఐదుగురు కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు.

'ప్రభుత్వానికి బుద్ధి చెప్పి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి'

తాళ్లరేవు, మార్చి 17: హత్యారాజకీయాలు చేసే వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు వడ్లమూరి సతీష్, జక్కుల ప్రసాద్‌బాబు ప్రజలను కోరారు. ఆదివారం పోలేకుర్రు పంచాయతీ జైభీమ్‌పేట గ్రామంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి మేనిఫెస్టో, సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. టీడీపీ నేతలు పూడా వెంకటరామకృష్ణ, నిమ్మకాయల మూర్తి, వనమాడి వెంకటరమణ, యేరుపల్లి వీరన్న, సాదనాల శివరామకృష్ణ, రేవు గోవరాజు తదితరులున్నారు.

లోవ క్షేత్రంలో భక్తుల కోలాహలం



ఆరుబయట వంటావార్పు చేసుకుంటున్న భక్తులు

తుని రూరల్, మార్చి 17: తూర్పు కనుమల్లో కొలువై మహిమలు విరాజిల్లుతున్న తలుపులమ్మ క్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారి దర్శనార్థం తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిసిరింది. ప్రత్యేక క్యూలలో బారులు తీరి అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో దేవస్థానం వసతి గదులు, ఆరుబయట వంట షెడ్‌లలో వంటావార్పులు చేసుకుని కుటుంబసమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. భక్తుల కోసం ఆలయ ఈవో విశ్వనాథ రాజు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

పుష్కరిణిలో నీరు తొలగింపు



పిఠాపురంలో నీటిని తొలగించిన దృశ్యం

పిఠాపురం, మార్చి 17: పట్టణంలోని పాదగయ పుష్కరిణిలో నీటిని తొలగించారు. మహాశివరాత్రి పర్వదినాల సమయంలో పుష్కరిణిలో లక్షలాది మంది పుణ్యస్నానాలు ఆచరించారు. పాదగయలో పితృదేవతలకు మూసివాయినాలు నిర్వహించారు. దీంతో పాదగయ పుష్కరిణిలో నీరు రంగు మారడంతో నీరు తొలగించాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకు అనుగుణంగా నీటి తొలగింపు పనులు ప్రారంభమయ్యాయి. పూర్తిగా తొలగించిన అనంతరం శుద్ధి చేసి కొత్త నీరు ఉంచుతామని అధికారులు తెలిపారు. భక్తులు స్నానాలు ఆచరించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారని ఆలయ కార్యనిర్వహణాధికారి పులి నారాయణమూర్తి తెలిపారు.

అడివిరాజులబాబు ఉత్సవం

ప్రత్తిపాడు, మార్చి 17: మండలంలోని పెదశంకర్లపూడిలో ఆదివారం అడివిరాజులబాబు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామానికి అనుకున్న ఉన్న కొండపై కొలువైన అడివిరాజుబాబు ఆలయానికి పెదశంకర్లపూడి, చినశంకర్లపూడి, ఏలూరు, సిరిపురం, లంకలోవ, ఉత్తరకంచి తదితర గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అన్నవరం దేవస్థానం పాలక మండలి సభ్యుడు దోే చిట్టిబాబు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ దోే సూరిబాబు, లంపకలోవ సొసైటీ చైర్‌పర్సన్‌దోే హరిబాబు తదితర పెద్దలు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భారీ అన్నదానం చేపట్టారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు

సర్పవరం జంక్షన్, మార్చి 17: కేంద్ర ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూలు ప్రకటించిన నేపథ్యంలో పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. సర్పవరం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, సీఐఎస్ఎఫ్ బలగాలతో ఆదివారం సర్పవరం జంక్షన్‌లో వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉండడంతో రూ.50 వేల నగదు మించి రవాణా చేయరాదని, అంతకు మించి నగదు ఉంటే తప్పనిసరిగా తగిన ఆధారాలు చూపించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల సక్రమ నిర్వహణ కోసం అక్రమ మద్యం, నగదు, ప్రలోబాలకు గురి చేసే ఏ వస్తువులనైనా రవాణా చేస్తే సీజ్‌చేసి కేసు నమోదు చేస్తామన్నారు.

బీచ్‌రోడ్డులో...

ఉప్పాడ (కొత్తపల్లి), మార్చి 17: ఉప్పాడ బీచ్‌రోడ్డులో ఆదివారం కొత్తపల్లి పోలీసులు వాహనాల తనిఖీ ప్రారంభించారు. ఎన్నికల కోడ్ ప్రారంభమైన తరుణంలో ఎస్ఐ స్వామి నాయుడు ఆధ్వర్యంలో తనిఖీల ముమ్మరం చేపట్టారు.

బైక్స్ ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు



మోటార్‌సైకిళ్లు ఢీకొన్న దృశ్యం

పిఠాపురం, మార్చి 17: పిఠాపురం బైపాస్‌రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కాకినాడ నుంచి గొల్లప్రోలు వైపు వెళ్లతున్న మోటార్‌సైకిల్‌ను ఎదురుగా రాంగ్‌రూట్‌లో వస్తున్న మరో మోటార్‌సైకిల్ ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. హైవే పోలీసులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కుట్టుమిషన్ల పంపిణీ

కాకినాడ రూరల్, మార్చి 17: కాకినాడ లయన్స్ కమ్యూనిటీహాల్లో లయన్ డి.రామసుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లయన్స్ జిల్లా గవర్నర్ వేలూరి సూర్యనారాయణ చేతులమీదుగా పేద మహిళలకు స్వయం ఉపాధి నిమిత్తం కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ పూర్వపు జిల్లా గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ, వెంకటరమణ, పుత్రరావు, శ్రీనివాస్, సతీష్ పాల్గొన్నారు.

చింతాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

పిఠాపురం రూరల్, మార్చి 17: పిఠాపురం మండలం విరవ గ్రామంలో చింతాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా జరిగింది. హోమాలు, ఇతర పూజల్లో ఎమ్మెల్యే పెండెం దొరబాబు పాల్గొన్నారు. అన్న సమారాధన జరిగింది.